సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపించుకుందాం



బొబ్బిలి: ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే శంబంగికి దిష్టి తీస్తున్న మహిళలు

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: రాష్ట్ర ప్రజల సంక్షేమం కోరే వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లోనూ మళ్లీ గెలిపించుకుందామని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పిలుపునిచ్చారు. స్థానిక పట్టణంలోని 30వ వార్డులో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయనకు అక్కడి ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఈ ఐదేళ్లలో జగనన్న ప్రభుత్వం ప్రజలకు చేసిన సంక్షేమ లబ్ధిని వివరించారు. అన్నివర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలన్న సదుద్దేశ్యంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేకానేక సంక్షేమ పథకాలు రూపొందించి, అమలు చేశారన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందజేసి, అందరివాడు అన్న గొప్ప గుర్తింపు పొందారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా సుపరిపాలనకు నాంది పలికిన మన జగనన్నకు మనమంతా అండగా నిలవాలని, ఆయనను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. ఆయనతోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమన్నారు. ఆయన సీఎంగా ఉంటేనే ఇప్పుడు అమలవుతున్న సంక్షేమ పథకాలు అమలవుతాయన్నారు. ఎన్నికల వేళ టీడీపీ కూటమి నేతలు చెప్పే మాయ మాటలను నమ్మవద్దన్నారు. వారిని నమ్మితే గతంలో లాగే ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, సంక్షేమ పాలనకు పట్టం కట్టాలన్నారు. తనను కూడా మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, జేసీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ శంబంగి శ్రీకాంత్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ శంబంగి వేణుగోపాలనాయుడు, పట్టణ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు, కౌన్సిలర్ వాడపల్లి వనజామనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తు.. సంక్షేమానికి గుర్తింపు..

రేగిడి: ఫ్యాన్ గుర్తు సంక్షేమానికి గుర్తింపు అని, వైఎస్సార్ సీపీతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. మండలంలోని చిన్నశిర్లాం, పెద్దశిర్లాం, బుడితిపేట, అంబాడ, వెంకటాపురం, చినలింగాలవలస, పెద్దలింగాలవలస, అంబఖండి, ఖండ్యాం, వెంటాపురం గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన వారికి ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. పూలమాలలు, బొకేలు, హారతులతో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు.. ఈ ఐదేళ్లలో జగనన్న ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. అన్నిప్రాంతాలు, అన్నివర్గాల ప్రజలు బాగుండాలంటే సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అప్పటి టీడీపీ పాలనకు ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు. ఎన్నికల సమయంలో టీడీపీ కూటమి ఇచ్చే తాయిలాలకు ఆశపడి వారికి ఓటు వేస్తే ఐదేళ్లు నష్టపోతామన్న విషయం ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో అందరూ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తలే రాజేష్‌ను, ఎంపీగా పోటీ చేస్తున్న బెల్లాన చంద్రశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ అభ్యర్థించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు గేదెల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ కింజరాపు సురేష్, సర్పంచ్‌లు కెంబూరి వెంకటేశ్వరరావు, టంకాల ఉమాపాపినాయుడు, లెంక రాంబాబు, చుక్క వెంకటినాయుడు, గొర్లాన అప్పలనాయుడు, లావేటి వెంకటవేణుగోపాలనాయుడు, ఎంపీటీసీలు మజ్జి శ్రీనివాసరావు, రెడ్డి నర్సింగరావు, ఎర్నేన అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



రేగిడి: అంబఖండిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్ తదితరులు

చెప్పారంటే... చేస్తారంతే

జగనన్న రైతు పక్షపాతి..



సీఎం జగనన్న రైతుల పక్షపాతి. ఏదైనా హామీ ఇచ్చారంటే తప్పకుండా అమలుచేస్తారు. రైతు భరోసా పథకాన్ని నిరియ్గంగా ఐదేళ్ల పాటు ఇచ్చారు. ఇప్పుడు ఏడాదికి రూ.16 వేలు ఇస్తామని మేనిఫెస్టో ద్వారా చెప్పడం చాలా ఆనందంగా ఉంది. ఇచ్చిన హామీ ఖచ్చితంగా అమలు చేసే నైజం సీఎం జగనన్నది. చంద్రబాబు హామీలు నమ్మితే మోసపోవడమే.

– పొన్నాడ రాము, రైతు, గ్రా॥రాజుచీపురుపల్లి, రాజాం మండలం

ఏనాడూ రైతుకు ఇబ్బంది రానివ్వలేదు..



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు ఏనాడూ ఇబ్బంది రానివ్వలేదు. రైతు భరోసా పథకం ఇచ్చి, ఆదుకున్నారు. సకాలంలో విత్తనాలు ఇచ్చారు. పంటకు మద్దతు ధర ఇచ్చారు. ఇప్పుడు మళ్లీ రైతు భరోసా నగదు సాయాన్ని ఏడాదికి రూ.16 వేలకు పెంచారు. అమ్మఒడి, సున్నా వడ్డీ రుణాలు, చేయూత వంటి పథకాలు కూడా రైతులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపయోగపడుతున్నాయి.

–కోట్ల ఆదినారాయణ, రైతు, పెద్దశిర్లాం, రేగిడి మండలం

నమ్మదగ్గ హామీలు..



జగన్‌మోహన్‌రెడ్డి హామీలు నమ్మదగినవి. ఆయన అంటేనే నమ్మకం. ఏ హామీ ఇచ్చినా ఆయన తప్పనిసరిగా అమలుచేస్తారన్న విశ్వాసం ప్రజలందరిలో ఉంది. రైతులను అన్నివిధాలా ఆదుకున్న గొప్పతనం సీఎం జగన్‌కే దక్కుతుంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఒక్కటే ఇప్పటివరకు రైతులకు మేలు చేసే పథకాలు, కార్యక్రమాలు చేపట్టింది.

– గంట్రేటి భూషణరావు, రైతు, శ్రీహరినాయుడుపేట, సంతకవిటి మండలం.

వ్యవసాయంపై ఆసక్తి



గతంలో రైతులను ఎవరూ పట్టించుకోలేదు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత సాగుకు పెట్టుబడి సాయం అందిస్తుండడంతో వ్యవసాయం చేయాలన్న ఆసక్తి ప్రతీ రైతులో పెరిగింది. చెప్పిన తేదీకి చెప్పిన సమయానికి ఆర్థికసాయం అందిస్తుంటే వ్యవసాయం బాగా చేయగలుగుతున్నాం. ప్రస్తుతం ప్రకటించిన మేనిఫెస్టోలో కూడా రైతు భరోసా కింద ఇచ్చే ఆర్థికసాయం పెంచడం సంతోషం.

–సాకేటి వెంకటరావు, రైతు, రాజాం మండలం.

అమలుచేయని హామీలు ఆరు అయినా.. ఆరు వందలు అయినా వద్దంటున్నారు ప్రజలు. 2014 ఎన్నికల్లో రైతు రుణమాఫీ చేస్తానని ప్రకటించిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీనే మర్చిపోయారు. ఈ నేపథ్యంలో సూపర్ సిక్స్ పేరిట టీడీపీ ప్రకటించిన హామీలపై జనం మండిపడుతున్నారు. టీడీపీ హామీలన్నీ బూటకపు హామీలేనని విమర్శిస్తున్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఖచ్చితంగా హామీలు అమలు చేసిన సీఎం జగన్‌మోహన్ రెడ్డికే జనం.. జై.. కొడుతున్నారు. నవరత్నాల ప్లస్ పేరిట ఆయన ప్రకటించిన ఎన్నికల హామీలను, అందులోనూ రైతు భరోసా పథకం సాయాన్ని రూ.13,500 నుంచి రూ.16 వేలకు పెంచడంపై అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. –రాజాం

కోవిడ్‌లోనూ పథకాలు ఆగలేదు..



కోవిడ్ విపత్తు సమయంలోనూ ఎక్కడా సంక్షేమం ఆగలేదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అనుకున్న సమయానికి ఏ పథకం లబ్ధి అయినా లబ్ధిదారుల ఖాతాల్లోకి చేరిపోవాల్సిందే. ప్రతీ రైతు కుటుంబానికి ఈ ఐదేళ్లలో రూ.71,500 అందించారు. రానున్న ఐదేళ్లు రూ.80 వేల సాయం అందిస్తామని హామీ ఇవ్వడం చాలా సంతోషం. సీఎం జగన్ హామీలు నమ్ముతాం. చంద్రబాబు హామీలు నమ్మం. – ఇప్పిలి జోగినాయుడు, రైతు, గ్రా॥రాజుచీపురుపల్లి, రాజాం మండలం.

చంద్రబాబువి మోసపూరిత హామీలు..



రైతు భరోసా పథకం అనేది చంద్రబాబు మేనిఫెస్టోలో లేదు. చంద్రబాబు హామీలన్నీ మోసపూరితమైనవే. కేవలం ఎన్నికలప్పుడు ప్రజలను మోసగించడానికే ఆయన హామీలు ప్రకటిస్తారు. ఇప్పుడు టీడీపీ మేనిఫెస్టోలో చేర్చిన హామీలేవీ ఇతర రాష్ట్రాల్లో అమలు చేయడం సాధ్యం కాలేదు. గత ఎన్నికల్లో సీఎం జగన్ ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చారు. జగన్‌కే మా మద్దతు.

– అదపా చంద్రినాయుడు, రైతు, శిర్లాం, రేగిడి మండలం.

సీఎం జగన్‌తోనే అన్నివర్గాలకు మేలు



తెర్లాం: కూనాయవలసలో ఎన్నికల ప్రచారంలో ప్రచార రథంపై ఎమ్మెల్యే శంబంగి

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

తెర్లాం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్నివర్గాల ప్రజలకు మేలు అని, రానున్న ఎన్నికల్లోనూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, వైఎస్సార్ సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కోరారు. మండలంలోని తమ్మయ్యవలస, కుమ్మరిపేట, కూనాయవలస, ఎం.ఆర్.అగ్రహారం, రంగప్పవలస, వెలగవలస, పణుకువలస, సోమిదవలస గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయనకు ఆయా గ్రామాల ప్రజలు సాదరస్వాగతం పలికారు. అనంతరం ఆయన ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, పేదల బతుకులు మారాలన్నా మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నే రావాలన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. గతంలో టీడీపీ పాలనలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. మీ కుటుంబంలో మంచి జరిగితేనే ఓటు వేయాలని కోరిన దమ్మున్న నేత మన జగనన్న అని అన్నారు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రకటించిన మేనిఫెస్టోకు కూడా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. బొబ్బిలి నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా ఈ ఐదేళ్లలో అనేక సంక్షేమ, అభివృద్ధి పనులను సీఎం జగన్ సహకారంతో చేయగలిగానన్నారు. భవిష్యత్‌లో మరింత అభివృద్ధి, సంక్షేమం చేసేందుకు మరోసారి తనకు ఎమ్మెల్యేగా అవకాశమివ్వాలన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి ఎస్.బాబ్జీరావు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు టి. సత్యంనాయుడు, డీసీసీబీ డైరెక్టర్ బి.అప్పలనాయుడు, కూనాయవలస సర్పంచ్ బి.విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను అరికట్టండి

- బొబ్బిలి ఆర్‌డీవో, తెర్లాం తహసీల్దార్‌లకు రైతుల ఫిర్యాదు



తెర్లాంలోని దాసరిబందకు సాగునీరు వెళ్లే కాలువపై నిర్మిస్తున్న అక్రమ కట్టడాలు

తెర్లాం: సాగునీటి కాలువపై నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను అరికట్టాలని కోరుతూ బొబ్బిలి ఆర్‌డీవో శేషసాయి, తెర్లాం తహసీల్దార్ రాజ్యలక్ష్మిలకు ఆయకట్టు రైతులు సోమవారం ఫిర్యాదు చేశారు. తెర్లాం గ్రామంలోని దాసరిబందకు వర్షం నీరు వచ్చే సాగునీటి కాలువపై గ్రామానికి చెందిన చింతల వెంకటేష్ అనే వ్యక్తితో పాటు, అంట్లవార గ్రామానికి చెందిన కోట అప్పలనాయుడు ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని బోను అప్పలనాయుడు అనే రైతుతో పాటు మరికొంత మంది రైతులు కలిసి ఫిర్యాదులో తెలిపారు. వారు కడుతున్న అక్రమ కట్టడాల కారణంగా వర్షపు నీరు దాసరిబందకు వచ్చే అవకాశం లేదని, దీంతో ఖరీఫ్ సీజన్‌లో పంటలు పండించుకునేందుకు అవసరమైన సాగునీరు అందదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, సాగునీటి కాలువపై అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను అడ్డుకుని, న్యాయం చేయాలని కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో రైతులు ఇచ్చిన ఫిర్యాదుపై తహసీల్దార్ రాజ్యలక్ష్మి స్పందిస్తూ అక్రమ కట్టడాలను పరిశీలించాలని వీఆర్‌వో గోపాల్‌ను ఆదేశించారు. స్థానిక పంచాయతీ విస్తరణాధికారి సూరిబాబు.. అక్రమ కట్టడాలను ఆపాలని సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేశారు.

రాజాం అసెంబ్లీ బరిలో అభ్యర్థులు వీరే..



డాక్టర్ తలే రాజేష్
వైఎస్సార్ సీపీ అభ్యర్థి

అభ్యర్థి పేరు	పార్టీ పేరు
1. కంబాల రాజవర్థన్	కాంగ్రెస్
2. కోండ్రు మురళీమోహన్	టీడీపీ
3. డాక్టర్ తలే రాజేష్	వైఎస్సార్ సీపీ
4. బొత్స బుద్ధుడు	బహుజన సమాజ్‌వాది పార్టీ
5. కుప్పిలి చైతన్యకుమార్	జై భారత్ నేషనల్ పార్టీ
6. పొడుగు రామకృష్ణ	జై భీమ్‌రావు భారత్
7. ఎన్ని రాజు	స్వతంత్ర
8. గండి అప్పారావు	స్వతంత్ర
9. మజ్జి గణపతి	స్వతంత్ర
10. మన్నేన రమేష్	స్వతంత్ర

రాజాం: అసెంబ్లీ స్థానానికి గాను ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితాను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎల్.జోసెఫ్ సోమవారం ప్రకటించారు. మొత్తం 20 నామినేషన్లు దాఖలు కాగా, ఈ నెల 26వ తేదీన జరిపిన స్క్రూట్నీలో రెండు నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగగా, ఒక అభ్యర్థికి ఒకటి కన్నా ఎక్కువ ఉన్న నామినేషన్ల ఉపసంహరణ జరిగింది. ఈ మేరకు పది మంది అభ్యర్థులు బరిలో నిలవగా, వారిలో నలుగురు అభ్యర్థులు స్వతంత్ర అభ్యర్థులుగా ఉన్నారు. స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కూడా కేటాయించారు.

నేడు మండాకురిటిలో ఎన్నికల ప్రచారం

సంతకవిటి: మండలంలోని మండాకురిటి గ్రామపంచాయతీలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బెల్లాన చంద్రశేఖర్, డాక్టర్ తలే రాజేష్‌లు కలిసి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఉదయం 8 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి పార్టీ మండల నాయకులు, కార్యకర్తలంతా హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

బ్యాంకు ఖాతాలకు పింఛన్ నగదు

రామభద్రపురం/బాడంగి/మెంటాడ/వంగర/రాజాం సిటీ: మండల కేంద్రాల్లోని మండల పరిషత్ కార్యాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఎంపీడీవోలు సోమవారం సమావేశమై, పింఛన్ల పంపిణీపై పలు సూచనలు చేశారు. పింఛన్ కోసం లబ్ధిదారులు సచివాలయానికి రావాల్సిన పనిలేదని, ఆధార్‌కార్డు లింకు ఉన్న బ్యాంకు అకౌంట్‌కు డీబీటీ ద్వారా పింఛన్ నగదు జమ అవుతుందని తెలిపారు. కదలలేని, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, దివ్యాంగులు, మంచంపట్టిన వారి వద్దకు సచివాలయ కార్యదర్శులే నేరుగా వెళ్లి, పింఛన్ అందజేయాలన్నారు. ఇదే విషయాన్ని సదరు లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది ద్వారా తెలియజేయాలన్నారు. ఎవరి బ్యాంకు ఖాతాలోనైనా నగదు జమకాకపోతే వారికి ఇంటి వద్దనే పింఛన్ నగదు అందించడం జరుగుతుందన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఏప్రిల్, మే నెలలకు సంబంధించి, ఫించన్ నగదు బ్యాంకు ఖాతాల ద్వారా జమ చేయడం జరుగుతుందన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని దన్నానపేట గ్రామానికి చెందిన దువ్వ పైడమ్మ ఇటీవల ఉపాధి పనికి వెళ్తూ, రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. ఆమెది నిరుపేద కుటుంబం కావడంతో గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అట్టాడ అప్పలనాయుడు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో కర్రోతు కూర్మారావు, బూర గోవింద పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయండి



తెర్లాం: పెరుమాళిలో ఎన్నికల ప్రచారంలో ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వైఎస్సార్ సీపీ నేతలు ఎన్నికల ప్రచారంలో జోరు పెంచారు. సోమవారం జరిగిన ప్రచారంలో ఇంటింటికీ వెళ్లిన ప్రజాప్రతినిధులు ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. గ్రామగ్రామాన ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ నేతలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండడం విశేషం.

– సాక్షి నెట్‌వర్క్.



రామభద్రపురం శ్రీరామ్‌నగర్ కాలనీలో ఎంపీపీ లక్ష్మణరావు ఎన్నికల ప్రచారం

మే 1 నుంచి వేసవి శిక్షణ శిబిరం

చీపురుపల్లి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో మే ఒకటో తేదీ నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు పీసీ స్వరూప్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఏటా జరుగుతున్న మాదిరిగానే ఈ ఏడాది కూడా ఉచిత వేసవి క్రీడా శిక్షణా శిబిరంలో క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, టెన్నీకాయిట్, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, తదితర క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 8 వరకు... సాయంత్రం 4 నుంచి ఆరు గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ శిబిరానికి పది నుంచి పదహారు సంవత్సరాలు లోపు వయస్సు గల విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో షటిల్ పోటీలు

విజయనగరం ఫోర్ట్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి షటిల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఐఎంఏ సభ్యులు అధికంగా పాల్గొన్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి రేడియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్, హెచ్ఓడీ ప్రసాద్, ఈఎన్‌టీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ బర్ల అజయ్‌కుమార్ ద్వితీయ స్థానం సాధించారు. వీరికి ఐఎంఏ ప్రతినిధులు మెడల్స్ అందజేశారు.

క్లుప్తంగా

నేత్ర శస్త్రచికిత్సకు 66 మంది ఎంపిక



వృద్ధుడి కంటిని పరీక్షిస్తున్న వైద్యులు ఆదిత్య, జాక్సన్

బాడంగి: మండలంలోని మల్లంపేటలో సోమవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి హాజరైన వారిలో 66 మందిని నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్లు క్యాంప్ ఇన్‌చార్జ్ వెంకటరమణ తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మొత్తం 131 మంది వివిధ కంటి సమస్యలతో వచ్చారని, వారందరికీ పరీక్షలు జరిపి, ఆపరేషన్లకు రిఫర్ చేశామన్నారు. అవసరమైన వారికి మందులు కూడా ఉచితంగా అందజేశామన్నారు. కార్యక్రమంలో వాడాడ పీహెచ్‌సీ డాక్టర్ ఆదిత్య, శంకర్ ఫౌండేషన్ డాక్టర్ జాక్సన్, వైద్యారోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా



ఎంపీడీవోకు రాజీనామా పత్రాలు అందిస్తున్న వలంటీర్లు

రాజాం సిటీ: మండలంలోని ఒమ్మి గ్రామానికి చెందిన ముగ్గురు వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. అనంతరం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి, ఎంపీడీవో వి.శ్రీనివాసరావుకు వారు తమ రాజీనామా పత్రాలు అందజేశారు. వారంతా తమ వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేసినట్లు రాజీనామా పత్రాల్లో పేర్కొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు జరగాలి



పారంపేట వాసులకు ఎన్నికల నిబంధనలు వివరిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు

రేగిడి: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని, దీనికి ప్రజలంతా సహకరించాలని ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావు కోరారు. మండలంలోని పారంపేట గ్రామంలో ఎన్నికల నిబంధనలు, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణపై సోమవారం అవగాహన కల్పించారు. ఎన్నికలు సజావుగా జరిగేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని, ప్రజలు కూడా తమవంతు సాయం అందించాలన్నారు. ఎన్నికల వేళ తగాదాలకు పాల్పడవద్దని, వివాదాల జోలికి వెళ్తే జీవితాలు నాశనమైపోతాయన్నారు. అలాగే గ్రామాల్లో మద్యం, గుట్కా వంటి మత్తుపానీయాలను నిల్వ ఉంచరాదన్నారు. పరిమితికి మించి మద్యం, డబ్బు తరలించవద్దన్నారు.

కళాశాల అడ్మిషన్లు ప్రారంభం



విద్యార్థుల నుంచి అడ్మిషన్లు తీసుకుంటున్న తెట్టంగి హైస్కూల్ హెచ్ఎం శ్యామలాదేవి

గుర్ల: తెట్టంగి హైస్కూల్‌లో ఈ ఏడాది నుంచి జూనియర్ కళాశాల నిర్వహించనుండడంతో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హెచ్ఎం శ్యామలాదేవి తెలిపారు. సోమవారం స్థానిక పాఠశాల ఆవరణలో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇకపై జూనియర్ ఇంటర్ స్థానికంగా చదువుకునే అవకాశం లభించిందన్నారు. ఎంపీసీ, సీఈసీ గ్రూపులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు.

ఐదో తేదీలోగా పింఛన్లు పంపిణీ చేయాలి

నెల్లిమర్ల: పంచాయతీ కార్యదర్శులు మే 5వ తేదీ నాటికి పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని ఎంపీడీఓ జి. రామారావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంక్ ఖాతాలు అనుసంధానం చేసుకున్న లబ్ధిదారులకు పింఛన్లు నేరుగా ఖాతాకు జమ చేయాలన్నారు. దివ్యాంగులు, మంచానికే పరిమితమైన వారు, దీర్ఘకాలిక రోగులకు ఇంటివద్దే నగదు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె. సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

పూసపాటిరేగ: ప్రతి ఒక్కరూ వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేష్‌వర్మ అన్నారు. మండలంలోని కొత్త కొప్పెర్లలో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, ఎండలు బాగా ఉన్నందున తెల్లటి పలచని వస్త్రాలు ధరించాలన్నారు. తల తిరగడం, జ్వరం లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడ్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సిబ్బంది గాడి బంగారుబాబు, ఆర్వీ రమణ పాల్గొన్నారు.